**మమత కావచ్చు, బాధ్యత కావచ్చు-ఏమైనా జీవితమంతా ఇతరుల క్షేమంకోసం వెచ్చించినవారు అనేకులు ఉన్నారు. లేకపోతే ప్రపంచంలో ఇంతమంది ఇంతకాలం మన గలిగి ఉండేవారు కారు. జవసత్వాలు ఉడిగిన తరువాత కేవలం జీవికకొరకు తమవల్ల ఉపకారం పొంది తమను విడిచిన వారిమీదనే ఆధారపడవలసిన దుర్గతి మాత్రం ఒక శాపం.**

సాయంకాలానికి కాంప్ నుంచి తిరిగివచ్చాను. డాక్టరు రావుగారు ఈవేళ నాలుగయిదుసార్లు ఫోన్ చేశారని, వచ్చిన వెంటనే మాట్లాడమన్నారని జవాను సందేశం. భోపాల్ వచ్చినప్పటినుంచీ డాక్టరు రావు గారితో పరిచయమయింది. ఆయన మా జిల్లావాడే కనక చాలా చనువుగా ఉంటున్నాము. హమీదియా హాస్పిటల్‌కు, బంగళాకు ఫోన్ చేసినా దొరకలేదు. టేబిల్‌మీద డయిరీలో తెలుగులో, "గౌరీపతి మాస్టారు" అని శ్రీమతి దస్తూరీ. పిలిచి అడిగాను.

"ఎవరో మాస్టారట ... తెలుగువారు. మీరు తెలుసునని డాక్టరు గారితో చెప్పారట. చాలా ప్రమాద పరిస్థితిలో ఉన్నారట. గౌరీపతి మాస్టారని చెబితే మీరు గుర్తుపట్ట గలరని చెప్పారట. మీరు తిరిగి వచ్చిన వెంటనే హాస్పిటల్‌కు వచ్చి కలుసుకోమన్నారు. రాత్రి జనతా నుంచి దింపి హాస్పిటల్‌కు పంపించారట రైల్వేవాళ్ళు. ఎవరూ దిక్కు లేకుండా . . . చావు బ్రతుకుల్లో ఉన్నారట. ఈరోజు గడవడం కష్ట మన్నారు. ఒకసారి వచ్చి కలుసుకోమని డాక్టరుగారు రెండు మూడుసార్లు ఫోను చేశారు."

ఇంకా శ్రీమతి ఏం చెబుతూందో వినిపించుకోలేదు. డ్రయివర్ గారేజ్‌లో పెడుతూన్న కారు ఆపి హమీదియాకు తీసుకువెళ్ళమన్నాను. ఏమిటో అయోమయంగా ఉంది. గౌరీపతి మాస్టారు. పొట్టి విగ్రహం. బట్టతల. ఖద్దరు పంచె, జరీ కండువా. ఎక్కడెదురయినా రెండు చేతులూ పట్టుకుని ఆప్యాయంగా ఇంకా నాతో మాట్లాడుతున్నట్టే ఉంది. బుర్ర నిండా వరదల్లో గోదావరి కెరటాల లాంటి జ్ఞాపకాలు.

పదేళ్ళ క్రితం మాట. మండు వేసవికాలం. మేనెల. మధ్యాహ్నం పన్నెండు గంటలకు కోటిపల్లి బస్సునుంచి ధవళేశ్వరం ఆనకట్ట వద్ద దిగాను. బొబ్బర్లంక నడిచి వెళ్ళాలి. ఆనకట్టను చేరిన ఇరుకైన సిమెంట్ రోడ్ ఆ ఎండలో పెసరట్టు పెనంలా కాలుతూంది. కుడి వైపున గోదావరి చెంప దెబ్బలకు అలిసిపోయిన ఆనకట్ట తలుపులు పడి ఉన్నాయి. గోదావరిలో నీరు చల్లారిన సంసారంలా మెదులుతూంది. ఎడమవైపు కాతేరు నల్లరాళ్ల గుట్టలు కేశవరపు ఎర్రరాళ్లతో కలిసి ఓట్ల కోసం పొంచి ఉన్న రకరకాల రాజకీయపక్షాల్లా మెరుస్తున్నాయి. వెనకనుంచి రాళ్ళు మోస్తున్న లారీలు. ముందునుంచి ఆనకట్టమీద పని చేస్తున్న వేమగిరి కూలీలు. అంతా రద్దీగా ఉంది రాజమండ్రి మెయిన్ రోడ్‌లా. వెన్నెలో, చీకటో తెలియనంత చిత్రంగ కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. నెత్తి కాలుతూంది. మధ్య ఉన్న పిచ్చికలంక చేరుకునేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. సీమచింతచెట్టు నీడలో కాస్సేపు నించుందామని గట్టు కిందకు దిగాను.

"**ఓహో ... హో! ఏమిటీ ఈ అసాధారణ సమావేశం!** దయచెయ్యండి. అంతా క్షేమమా? ఎక్కడనుంచి రాక?" గౌరీపతిగారి ఆహ్వానం. మర చెంబు మూత తీసి మంచి తీర్థం ఇచ్చారు. "ఏమిటి **విశేషాలు? వ్యవసాయమేనా? అదేమిటి బాబూ ... ఇంతా** చదువుకుని తమబోటులు వ్యవసాయంలోకి దిగుతారా? డి. పి. డబ్ల్యు.లో చేరితే పట్టుమని పదేళ్లలో చీఫ్ ఇంజనీయరు కారటండీ!"

పక్కనున్న బుగ్గమీసాలాయనతో పరిచయం చేశారు. కాస్సేపు కాలక్షేపం అయింది. ఒళ్ళు చల్ల బడింది. ఇక బయలుదేరదామని నించున్నాను.

"అయ్యా ... ఒక్కమాట. రండి ... ఇలా దయ చేయండి." దూరంగా తీసుకువెళ్లి చెవిలో ఊదారు. "మీ **ఊళ్లో** మంచి మాగాణీ రెండెకరా లుంటే కొనిపెడుదురూ. కొంత కొబ్బరితోటయినా ఫరవా లేదు. ఈ నాలుగు రాళ్ళూ ఇలా జేబులో వేసుకు తిరుగుతే ఆగుతాయా? దసరా వెళ్లినప్పటినుంచి సబ్ రిజిస్ట్రారు ఆఫీసు దగ్గిరే ఉంటున్నాను. సబ్ రిజిస్ట్రారు మావాడే లెండి. కావలిసినవాడు. 'రోజూ అలా వస్తూండు, మామయ్యా, కాలక్షేపానికి' అన్నాడు. అందుకే ఈ పాట్లన్నీ. ఏదో కాలం గడిపేస్తున్నాను లెండి. మీ దయవల్ల నాలుగు రాళ్ళు చేతిలో నిలిచాయి. ఉమీద భగవంతుడి దయ. ఈ ఒక్క సహాయం చేసి పెడుదురూ ... మీ కడుపున పుడతాను. కుదిరిన వెంటనే ఒక్క ఉత్తరం వ్రాయించండి. రెక్కలు కట్టుకు వాలతాను. నా పేర సేరవరం ... ఒక్క కార్డు ముక్క ... కోర్టుకి సెలవులయితే రత్నంపేట. రామ చంద్రపురం. కాకితో కబురంపితే చాలు."

గౌరీపతి మాస్టారంటే నాకు చాలా గౌరవం. అక్షరాభ్యాసం చేయించిన గురువులు. పాతికేళ్ల క్రితం మా ఊళ్లో మాస్టర్‌గిరీ చేశారు. తరవాత కోనసీమలో కరిణీకం చేసి నాలుగు రాళ్ళు సంపాదించారు. మంచి లోకానుభవం కలవాడు. కనకనే ఇంటర్ పాసయి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో గుమాస్తా పని చేస్తూన్న పెద్ద అల్లుడు గోపాలాన్ని తీసుకువచ్చి సెంట్రల్ డెల్టాలో ఇరిగేషన్ గుమాస్తాగా వేయించాడు. ఎవళ్ళైనా, "ఇదేమిటయ్యా! నూట పాతిక రూపాయలు సంపాదిస్తున్నవాణ్ణి ముప్ఫై రూపాయల ముష్టి ఉద్యోగానికి పంపించావు" అంటే, "కుర్రవాళ్ళు. మీకేం తెలుసు? ఉద్యోగం దర్జాకోసం కాదు. నలుగురు పిల్లల్ని కని పోషించుకోవాలి కాని, పెద్ద పోస్టాఫీసులో పంకాకింద కూర్చోడం కాదు. ఇరిగేషన్ గుమాస్తా గిరీ అంటే ఓ అగ్రహారం ఉన్నట్లు కాదటయ్యా?" అనేవాడు.

# పిన్నమరాజు రామకృష్ణంరాజు

కొంతకాలం తరవాత బెజవాడలో ఓ సాయంకాలం వర్షం జోరుగా కురుస్తూంది. గాంధీనగరం నుంచి ఇంటికి వెడుతున్నాను. ఏలూరు రోడ్‌లో గోడీల దొడ్డి దాటాక వీధిలో మేడమీద నుంచి ఎవరో కేకేశారు. కారు వేగం తగ్గించి వెనక్కు తిరిగి చూశాను. గౌరీపతి గారు గొడుగుతో పరిగెత్తుకు వచ్చారు. ఇంటికి తీసుకు వెళ్లి కాఫీ తాగాక కస్సేపు కష్టసుఖాలు మాట్లాడు కున్నాము.

"ఏదోలెండి. మా కాలం వెళ్లిపోతూంది. పాలకొల్లు రత్నంగారు, 'అదేమిటయ్యా...ఇంటి దగ్గిర కూర్చుని ఏం చేస్తావ్? నడు. బెజవాడలో కొబ్బరికాయల వ్యాపారం చూస్తూండు. అనుభవం కలవాడవు' అని లాక్కు వచ్చాడు, కాలవలు తెరిచాక. రెండు నెలలయింది. ఏదో కాలక్షేపం అయిపోతూంది. అంతా ఆ భగవంతుడి దయ" అని చెయ్యెత్తి మా ఇంట్లో కాలెండరు దేవుడికి నమస్కారం చేశారు.

"ఏమిటీ! మీ తమ్ముడు ఆర్. టి. ఒ. అయ్యాడా? ఎంతవాళ్లయ్యారయ్యా! ఇంతకీ ... ఆయనదే ఇదంతా...మీ తండ్రిగారు మహానుభావుడు. అదృష్టం లేకపోయింది. ఎట్లా అయినా పెట్టి పుట్టినవాళ్ళు వెళ్లొస్తా" అని బయలుదేరారు. వరండా మెట్లు దిగుతూ, "నీకు తెలియని విషయం ఏముంది, బాబూ? ఈ నాలుగు రాళ్లతోనూ ఏదైనా వ్యాపారం చేసి కుటుంబం గట్టెక్కిస్తేకాని — తరవాత ఏదో కృష్ణా రామా అనుకుంటూ కాలం వెళ్లబుచ్చవచ్చు. కాస్త మీ వాడితో అని చూద్దూ. ఒక్క బస్ పర్మిట్. ఏ రూటయినా ఫరవాలేదు. మీ పేరు చెప్పుకు బ్రతుకుతాను. మీవాణ్ణి '**ఊ**' అనిపించావంటే చాలు, నీ కడుపున పుట్టి ఋణం తీర్చుకుంటాను. ఎప్పుడయినా సరే—ఫోను నెంబరు ఏభైమూడు, కాశేశ్వర్రావు మార్కెట్‌కు పిలిస్తే పరిగెత్తుకు వస్తాను. ఫోను నెంబరు గుర్తుంటుందా...ఈ సంవత్సరంలో మొదటి రెండంకెలు తీసేస్తే మా ఫోను నెంబరు" అన్నారు.

తరవాత చూస్తే డ్రాయింగ్ రూమ్‌లో గౌరీపతి గారు గొడుగు మరిచిపోయారు. పంపించాలనుకునే నేనూ మరిచిపోయాను.

ఒకటి, రెండు సంవత్సరాల తరవా తనుకుంటాను— ఓసారి మాచర్లలో జరిగిన సంఘటన. బాగా చీకటి పడుతూంది. ఊళ్లోనుంచి స్టేషన్‌కు వస్తున్నాను. గుర్రంవారి ఆర్ట్సు స్కూలు దగ్గిర ఎవరో పేరుపెట్టి పిలిచారు. ముఖంలోకి అద్దంలో చూసినట్లు చూశారు. మన గౌరీపతిగారే! భారతంలోది ఒక పద్యం చదివారు. "చిరకాల దర్శనం. అదృష్టవంతుణ్ణి." రెండు చేతులూ పట్టుకున్నారు. స్టేషన్‌కు సాగనంపడానికి వచ్చారు. గుంటూరుకు టికెట్ తీసుకుని ప్లాట్‌ఫారం మీద పచార్లు చేస్తున్నాను, గౌరీపతిగారి పురాణం వింటూ.

"ఏదోలెండి. బాగానే వెళ్లిపోతూంది. ఖాళీగా తిరుగుతున్నానని ఊబలంక రామకృష్ణారెడ్డి, 'నడవయ్యా...నందికొండలో నాలుగు కంట్రాక్టు పనులు చేద్దాం. ఇక్కడ కూచుంటే ఏముంది? కాస్త దేశ దర్శనం అయినా అవుతుంది' అని లాక్కువచ్చాడు బలవంతంగా. ఏవో రెండు మూడు మట్టి పనులూ, అవీ చేశాం. పూర్వంలాగ కిట్టుబాటు కావడం లేదు, బాబూ. . . మన నానిపంతులుగాడి మేనల్లుడు ఇక్కడ


మీ
కడుపున
పుడతాను

ఇంజనీరు. వాడి పెళ్లానికి నేనే నాలుగు అక్షరం ముక్కలు నూరి పోశాను. ఏదో మనవాడే కదా అని అభిమానం కొద్దీ పలకరిద్దామని ఇంటికి వెళ్ళేసరికి చేతిలో ఉన్న వెన్నపూస డబ్బా చూసి, 'నిన్నూ, నీ రెడ్డినీ కంట్రాక్టు లిస్టులో నుంచి తీసేస్తాను' అని ఎగిరాడు. చూశావా? కాలం ఎలా మారిపోయిందో! వాడి పెళ్లాం అక్కడే ఉంటే చెవి మెలి పెట్టేద్దును. పురిటికి వెళ్లిందని చెప్పాడు బంట్రోతు. వెధవ పీనుగ ఎంత వాడయ్యాడో చూశావా!"

ఇంతలో రైలు బయలుదేరడానికి టికెట్ తీసుకుంది.

"మొన్న గుంటూరులో హైకోర్టు దగ్గిర మీ అన్నయ్యగారు కనిపించారు. ఏం అదృష్టవంతుడయ్యా! . . . నెలకు పదివేలు సంపాదిస్తున్నాడు ప్లీడరీ చేసి. ఏం మర్యాదా...ఏం లక్షణం. ఇంటికి తీసుకువెళ్ళేవరకూ విడిచిపెట్టందే!"

బెజవాడలో క్రితంసారి మా ఇంటి దగ్గిర మరిచిపోయిన గొడుగు జ్ఞాపకం చేశాను. "ఆ గొడుగుకేమిటిలెండి! అంతకంటే మంచి గొడుగు తీసుకుంటా ఎప్పుడైనా మీదగ్గిర నుంచి, మనం అంతా బావుంటే" అన్నారు. రైలు బయలుదేరింది. కిటికీతో గౌరీపతిగారి తల కూడా వస్తూంది.

"బాబూ ... ఒక చిన్న విషయం. అన్నగారితో చెప్పడానికి మొహమాట పడ్డాను. ఏమీ అనుకోకుండా ఉంటే ...ఆఁ.. మరేమీ కాదు. మా సుభద్ర మొగుడు. వాడూ...నర్సాపురం దేవళ్లవా రబ్బాయి. ఈమధ్య ఖాళీగా తిరుగుతున్నాడు. మెట్రిక్ దాకా చదివాడు. కోర్టు విషయాల్లో చలాకీ అయినవాడు. అన్నగారి దగ్గిర పడిఉంటే వాడి పొట్ట గడుస్తుంది. తొందరేమీ లేదు. అన్నగారిని తాపీగా అడిగి నాకొక కార్డు ముక్క—'కంట్రాక్టర్, విజయపురి సౌత్' అంటే చాలు." పందెం వేసినట్లు పరిగెడుతూన్న గౌరీపతిగారిని ఓడించి ముందుకు నడిచింది రైలు.

పందొమ్మిది వందల అరవై రెండులో ...బోసు నేను నాగపూర్‌లో ఉద్యోగం చేస్తూన్న రోజులవి. దేశం కాని దేశంలో ఆంధ్రుడనేవాడు పలకరిస్తే ఒళ్లు పులకరించేటంతటి ఉత్సాహం. అందులోనూ అప్పుడయినవాడు కళ్లకు కనిపిస్తే కౌగలించుకోవాలనే వ్యామోహం. ఢిల్లీనుంచి తిరిగి వస్తున్నాను. నిద్రపోతూన్న స్లీపింగ్ కార్‌లో ఒక్కసారిగా ప్రయాణికుల అలజడి. కిటికీలోంచి చూస్తే ఇటార్సీ రైల్వే స్టేషన్. ఇంకా తెల్లవారలేదు. బెడ్ టీ కోసం ప్రయత్నం. గుమ్మంలో సామానులతోబాటు మనుష్యులు గుట్టలుగా పడి ఉన్నారు. కండక్టరుతో ఎవరో ఘర్షణ పడుతున్నారు. హిందీరాని తెలుగువాడు కాబోలు నిష్కర్షగా స్వచ్ఛమైన తెలుగులో గోదావరి జలాల గలగలల్లా మాట్లాడుతున్నాడు.

"మాకు తెలుసు బాబూ ... ఇది స్లీపింగ్ కారని . . . అయ్యా . . . మాకు కూచోడానికి చోటిస్తే చాలు...నించుని అయినా వెళ్లిపోతాము. మళ్లీ తెల్లారితే మా బెజవాడ. ఎవరికీ ఇబ్బంది కాకుండా, నలుగురినీ మంచి చేసుకుని మీకు మాట రాకుండా. . . ఏదో మాకు తోచింది ... ఏమే. . . శారదా... కాస్త హిందీలో చెప్పవే. . . తెలుగు రాదు కాబోలు ఈ టికెట్ కలెక్టర్‌కు. . . తెల్లబోతూ నా మొహం చూస్తున్నాడు. పిగ్గు పడితే ఎలాగే? ప్రయాణాలు . . . అన్నీ ప్రయాసలే! నే చెప్పేదైనా హిందీలో ఏడ్చి వాడి నోరు నొక్కవే . . ."

"ఏమండోయ్ . . .మా అబ్బాయి కూడా రైల్వేలోనే పని చేస్తున్నాడు. మేమంత రూల్సు తెలియనివాళ్లం కాదు సుమా!" తెలుగు ఆడపడుచు కంచు కంఠం.

ఎదరకు వాలి చూస్తే గౌరీపతిగారు. అమాంతంగా కౌగలించుకోవాలనిపించినా, ఆయన మోస్తూన్న సామాన్లు, ముందున్న అమ్మాయిని చూసి విలువునా నించున్నాను. గౌరీపతిగారు గుర్తు పట్టారు.

"ఓహో. . .హో. . . ఎవరూ. . . నీకడుపు బంగారం కానూ మా పాలిటి ఆపద్బాంధవుడిలా వచ్చావయ్యా!"

"నమస్కారం, మాస్టారూ . . . ఎక్కడనుంచి రాక?"

"కాశీ వెళ్లాను బాబూ ... ఏం కాశియో ఏం ప్రయాణాలో . . . ఈ రైళ్లకంటే కాలి నడకే వెయ్యిరెట్లు బాగుండేలా ఉంది."

కండక్టరుతో కొంచెం ప్రయత్నం చేశాక హైదరాబాదు'టు టయర్'లో గౌరీపతిగారి కుటుంబానికి జాగా దొరికింది. చాలా బాగా కాలక్షేపం అయింది. పన్నెండు గంటలకల్లా నాగపూర్ చేరింది జనతా. గౌరీపతి గారిని విడిచి దిగిపోవడం బాధ కలిగించింది. ప్లాట్‌ఫారం మీద రైల్లో వెళ్లబోతూన్న ప్రయాణికుడో, దిగి వెళ్లిపోతూన్నవాడో ఎవరికీ తెలియనంత విధంగా గౌరీపతి గారితో చేతులు కలుపుకుని నించున్నాను.

"బాబూ . . . ఒక్కమాట . . . ఇక్కడ మన తెలుగు వాళ్లలో మీకు తెలిసిన ఎవరైనా ఉద్యోగస్థుడు... మన కంతగా ఇంటిపేరు పట్టింపులు లేవులెండి. . . మా శారదకి తగిన వరుడు మీరే చూసి పెట్టాలి. హిందీలో విశారద పాసయింది. సంగీతంలో నాలుగు రాగాలు ఆలాపించగలదు. అలహాబాదూ అవీ చూసినప్పటి నుంచీ ఉత్తరాది అంటే మహా ఇష్టపడుతూంది. ఇక్కడ కాలేజీల్లో కూడా తెలుగు కుర్రాళ్లు ఉన్నారన్నారు. కాలేజీ కుర్రాడయితే శారదను చూస్తే చేసుకు తీరతాడు. అద్దంలాంటి పిల్ల. ఆఖరిపిల్ల అనుకోండి. తల్లికి ఇష్టం లేకపోయినా పిల్ల సరదా పడుతున్నప్పుడు మేం ఎవళ్లం లెండి ఆపు చేయడానికి. ఇక్కడ మాత్రం ఏం లోటుంది? అలవాటు పడితే ఉత్తరాది తిండి చాలా ఆరోగ్యమయినది. చపాతీలు తిన్నప్పటినుండి ఒక్కసారి వదలలేరంటే నమ్మండి."

రైలు బయలుదేరింది. గౌరీపతిగారి భార్యకు నమస్కారం చేసి సుభద్ర, శారద, నర్సాపురం దేవళ్ల వారబ్బాయి, వారి పిల్లల అభినందనాలు అందుకుంటూ కిటికీ దగ్గిరగా నడుస్తున్నాను.

"సంబంధం ఏమాత్రం కుదురుతుందన్నా నా పేరన ఒక ఉత్తరం. మీ కడుపున పుడతాను. అడ్రసు నోట్ చేసుకున్నారుగా? 'ఒకటీ — ఎనిమిదీ — రెండువందల ముప్పై ఆరు, చిక్కడపల్లి, హైదరాబాదు' అంటే చాలు!"

సదర్ మంజిల్ దాటుతూంటే మలుపులో డాక్టరు రావుగారి కారు ఎదురయింది. కారు ఆపి రివర్స్ చేసి

## కొత్త పుస్తకాలు

'కొత్త పుస్తకాలు' శీర్షిక క్రింద సమీక్షకొరకు పుస్తకాలు పంపేవారు ఒకొక్క పుస్తకానికి రెండు ప్రతులు ఈ దిగువ చిరునామాకు పంపాలి:

ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మద్రాసు—2

ఈ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలు సాగించడం జరగదు.

—ఎడిటర్




ఇపుడే వెలువడినవి

'వనసీమలలో' ఆంధ్రప్రభ వారపత్రిక ద్వారా వేలాదిమంది పాఠకుల్ని ఆకట్టుకొన్న వేంబి ఆసాధారణ జీవిత కథ.

'వనసీమలలో' అడవుల మధ్య నోరులేని జీవాల ప్రేమానుబంధాలను చిత్రిస్తూ తీయని శైలిలో నడిచిన మహీధర నళినీ మోహనరావు రచన—45 చిత్రాలతో, అందమైన గెటప్. రు. 3–75 ల. మాత్రం. మేలు ప్రతి రు. 5–00 లు పోస్టేజి ఉచితం. వి. పి. లు లేవు.

ప్రతులకు:
అవంతీ ప్రచురణలు,
ప్రజాశక్తి నగరు,
విజయవాడ — 2.

లోపల కూచోబెట్టి తీసుకు వెళ్ళారు. హమీదియా హాస్పిటల్‌లో డాక్టరుగారి కన్సల్టింగ్ రూమ్‌లో కూచున్నాము.

"ఉదయం గౌరీపతిగారి ఆత్మకథ విన్నప్పటినుంచీ చాలా ఆందోళన పడ్డాను. తండ్రిలేని వాళ్ళందరికీ పెద్ద దెబ్బలాంటి అనుభవం. ఈరోజు ఆపరేషన్లన్నీ వాయిదావేసి మనస్తిమితం కోసం కారు వేసుకుని తిరుగుతున్నాను" అని డ్రాయరు లోంచి నాలుగు కాయితాలు తీసి ముందు వేశారు. చదవబోతే వ్రాసింది తెలుగులోనో, ఇంగ్లీషులోనో తెల్చుకోలేకుండా ఉన్నాను డాక్టర్ల వ్రాత. చదవమని రావుగారికే ఇచ్చాను. విడివున్న కాగితాలు పిన్ చేస్తున్నారు. డాక్టరు రావుగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఔనండి ... డాక్టరుగారూ ... గౌరీపతిగారు ... మా మాస్టారు ... నాకు తండ్రిలాంటివారు. పాపం ... ఈనాడు ఇంత దూరంలో ... ఇలా సంభవించిందంటే ... ఏమిటో ... అయోమయంగా ఉంది. పెద్దబ్బాయి రామచంద్రం విశాఖపట్నంలో లెక్చరర్. రెండో అతను ఆంధ్రాలోనే సబ్ కలెక్టర్. మూడో అతను సదరన్ రైల్వేలో ఇంజనీయరు. నాలుగోవాడు మెడిసిన్ చదువుతున్నాడని కిందటిసారి హైదరాబాదులో కలుసుకున్నప్పుడు చెప్పారు. అంతటి వాళ్ళకి ఇంతగా ఎందుకు దూరం అయ్యారో అర్థం కాకుండా ఉంది."

డాక్టరుగారు తేరుకుని, "తన వాళ్ళ అడ్రసులు ఇవ్వడానికి నిరాకరించారు. ఆయన ఎంత ఆత్మవేదన పడ్డాడో ... కాకపోతే బ్రోంకయిటీస్ అంత ప్రమాదమైన వ్యాధి కాదు ఈ రోజుల్లో. ఏదో జన్మ జన్మాల సంబంధాల్లా ... ముక్కూమొహం ఎరగని నా వద్ద.. ఆత్మబంధువులా చివరిసారిగా చేరారు" అన్నారు. ఇంత విచారవదనంతో డాక్టరు రావుగారిని నే నెప్పుడూ చూడలేదు. దిక్కులేక చస్తూన్న రోగి కోసం డాక్టర్లంత బాధ పడతారని అనుకోలేదు.

డాక్టరుగారు అన్నారు: "ఉదయాన్నే డాక్టరుమిశ్రాగారు ఫోను చేశారు. ఎవరో మద్రాసీని రైలు స్టేషన్ నుంచి అంబ్యులెన్సులో తీసుకువచ్చారని, డెత్ బెడ్ మీద ఉన్నాడని, మద్రాసీ మాట్లాడతాడని, కొంచెం వీలు చూసుకుని అడ్రస్ నోట్ చేసుకోమన్నారు పోస్టుమార్టంలో అవసరం అవుతాయని." డాక్టరుగారి

# మీ కడుపున పుడతాను

గొంతు బొంగురుపోయింది. "మీ గౌరీపతిగారు నన్నింతగా కదిలించడానికి కారణం లేకపోలేదు. మా నాన్న పోలికలు ఆయనలో ఉన్నాయి. మా నాన్నకి కర్మచేసే యోగం నాకు లేకపోయినా, మా నాన్నే ఈ రూపంతో వచ్చి ఈనాడు నాచేత చేయించుకున్నాడనే తృప్తి మిగిలింది. నా చిన్నతనంలోనే మా నాన్న పోయాడు. పాపం, గౌరీపతిగారు, డబ్బై ఏళ్ళ ముసలి తండ్రి. జీవితం అంతా నలుగురు కొడుకులూ, ముగ్గురు కూతుళ్ళ కోసం ధారపోసి, చివరి దశలో కన్న సంతానంచే తిరస్కరించబడి, భార్యా వియోగంతో, కొడుకులకు చికాకు కలిగించకుండా, కదలలేని రోగిగా కూతుళ్ళకు బరువు కాకుండా కాశీ వెళ్ళి గంగలో కలిసిపోదామనుకున్నారు. ఇటార్సీలో రైలు నుంచి దిగలేకపోయిన ఆయన్ని భోపాల్‌లో దింపి రైల్వేవారికి అప్పగించారు తోటి ప్రయాణికులు. అంతకంటే రికార్డులో ఏమీ లేదు. ఆఖరు క్షణాల్లో నా చేతి మీదుగా ఈ నాలుగు పేజీలూ వ్రాయించారు. దేశంలో తండ్రులకిచ్చిన ఆయన సందేశం ముమ్మాటికి నిజం. మనిషికి ప్రకృతి తొడిగిన సంతానాపేక్షతో పరిస్థితులతో ఎంత బలంగా పోరాడి నిలిచినా, ఆశించిన దానికంటె ఎక్కువ ఫలితం పొందినా, చివరికి మిగుల్చుకోవాలనుకునేది తనవాళ్ళ కృతజ్ఞత. కన్న సంతానం నుంచే కృతఘ్నత ఎదురైతే ఎవరు తట్టుకోగలరు? పాపం! గౌరీపతిగారికి దహన సంస్కారాలు చేయించి, సంప్రదాయమనుసారంగా తన కుమారుడుగా నిలుస్తానని, కర్మ చేయిస్తానని మాట ఇచ్చిన తరవాతే, చేతిలో చెయ్యి వేయించుకుని ప్రాణం విడిచారు. భోపాల్‌లో నాకు తెలిసిన తెలుగు వాళ్ళ పేర్లు ఏకరువు పెట్టగా మిమ్మల్ని గుర్తించారు. తనది దిక్కులేని చావు కాదని, గౌరీపతి మాస్టారు ఆఖరిసారిగా పిలుస్తున్నారని మీకు ఫోన్ చెయ్యమన్నారు." డాక్టరు గారి గుండెలు బరువెక్కిపోయాయి. కుర్చీలోంచి లేవలేకపోయారు.

గౌరీపతిగారి ఈ దిక్కులేని చావు కారణాలు నేను ఊహించలేనంత దూరంగా లేవు. ఆఖరుసారి గౌరీపతి గారిని నేను కలుసుకున్నది క్రిందటి సంవత్సరం హైదరాబాదులో.

మా మామయ్య హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారని తెలిసి, ఆయన వ్యాపార వ్యవహారాలు చూడ్డానికి రెండు నెలలు సెలవు మీద కుటుంబంతో హైదరాబాదు వెళ్ళాను. ఆయన వ్యాపారాలు ఊపిరి తిరక్కుండా నిర్వహించవలసి వస్తూంది. వారాని కొకసారైనా సుల్తాన్ బజార్‌లోని మావాళ్ళ బట్టల దుకాణానికి వెళ్ళి లెక్కలు చూసి వస్తూంటాను.

కౌంటర్‌లో కూచుని ఏదో విషయం మీద మానేజర్‌తో మాట్లాడుతున్నాను. షో కేస్ పక్క గొడుగుల బాక్సు నుంచి ఒక్కొక్క గొడుగు పరీక్షిస్తున్నారు గౌరీపతిగారు. ఒక్క చూపుతో ఆనవాలు పట్టలేనంత ముసలితనం ఆవరించినట్లు కనిపించారు. ఆహ్వానించి కూచోబెట్టాను. ఇదివరకటి ఉత్సాహం, ఆరోగ్యం ఏమీ కనిపించలేదు భార్యా వియోగం వల్ల అనుకున్నాను. కొడుకుల, అల్లుళ్ళ ఉద్యోగాల ఉచ్చస్థితిని గురించి చెప్పారు. రామచంద్రానికి మగపిల్లలు లేరని, మూడోవాడికి దాంపత్య సుఖం లేదని, మెడిసిన్ చదువుతూన్న ఆఖరివాడికి ఎవరూ సహాయం చెయ్యడం లేదని ఏవేవో కుటుంబ విషయాలతో బాధ పడ్డారు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈ చివరి రోజుల్లో కూడా తను ప్లీడరు గుమాస్తా చేసి పొట్ట పోషించుకోవలసి వస్తూందని, తన జీవితం ఎండిన చెట్టులా ఉందని, తన సంతానం నుంచి ఆదరాభిమానాలు చాలా తగ్గాయని, చివరివాడి మెడిసిన్ అయిపోతే తన జీవితానికి స్వస్తి వాచకం చెబుతానని బాధపడుతూ, కాస్సేపు ఏవేవో కష్టసుఖాలు మాట్లాడారు. సెలవు తీసుకు వెడుతూంటే ఒక జత పంచెల చాపు, ఒక గొడుగు చేతిలో పెట్టాను. గౌరీపతిగారు తిరస్కరిస్తూంటే పంచెల చాపుకు పసుపు బొట్లు పెట్టించి, బెజవాడలో మా ఇంటి దగ్గిర మరిచిపోయిన గొడుగుకు బదులుగా గొడుగు అని నచ్చచెప్పి ఇవ్వవలసి వచ్చింది. ఆయనలో అంతగా ఆత్మాభిమానం పెరిగింది.

డాక్టరు రావుగారు గౌరీపతిగారి అంతిమ సందేశం చదువుతున్నారు. గౌరీపతిగారి జీవిత సత్యాలు మన జీవితరాగాలను, జీవితాశయాలను, ప్రేమాభిమానాలను, మమతలను చీల్చి మన నిలువు నిజాలుగా పడగొడుతున్నాయి. నేనే కాదు; మీరు కూడా గౌరీపతిగారి మరణ శయ్య అభిప్రాయాలతో ఏకీభవించలేనంత బలంగా, ఏ సంతానాన్ని క్షమించలేనంత బరువుగా మానవజాతికి శాపంగా ఉన్నాయి.

తరవాత డాక్టరు రావుగారు డాక్టరు మిశ్రగారికి ఫోనుచేసి పోస్టుమార్టమ్ చెయ్యనవసరం లేదని ఫోను చేసి, అనుమతి తీసుకుని రేపు ఉదయం దహన సంస్కారాల ఏర్పాటు కావిద్దామన్నారు.

గౌరీపతిగారి నాలుగు పేజీల అంతిమ సందేశాన్ని ఇక్కడ ఏకరువుపెట్టి తండ్రులు — కొడుకుల రక్తసంబంధాల్ని సిగు పరిచి మీ మనస్సులో కారు మేఘాల్ని కదిల్చి, మనం ఎక్కుతూన్న మెట్లను కూల్చి మిమ్మల్ని ఆపుచేయ దలచుకోలేదు. ఎందుకంటే గౌరీపతి గారిచ్చిన సందేశం తండ్రులకే ప్రత్యేకం. కాని, చదివేవారిలో కొడుకులు ఎక్కువ కనక కొడుకులు కూడా కాలచక్రంలో తండ్రులు కాకపోతారా?

ఈ కాలగర్భంలో కొన్ని కోట్ల గౌరీపతులున్నా నాకు బాగా తెలిసినవారు మా గౌరీపతి మాస్టారే! ఆయన మనశ్శాంతికి మీ అందరితోబాటూ ప్రార్థిస్తున్నాను. ★

ఆట విడుపు (అజంతా శిల్పం) ప్రతికృతి - ఒ. వి. నరసింహాలు గుప్త (మదనపల్లి)

